
సాక్షి గుంటూరు

సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 4012 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1891 క్యూసెక్కులు వదిలారు.



పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునకొండను ఆదివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. లాంచీల ద్వారా రూ.61,750 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి 50,986 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి 58,788 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

న్యూస్‌రీల్

పలువురు డీఎస్పీలు బదిలీ

నగరంపాలెం: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం 47 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు రేంజ్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలువురు డీఎస్పీలకు స్థానచలనం కలిగించారు. గుంతకల్లు డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్‌ను గుంటూరు తూర్పు సబ్ డివిజన్ డీఎస్పీగా, వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ ఎం.రమేష్‌ను గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా, పీసీఎస్అండ్ఎస్ డీఎస్పీ ఎం.హనుమంతరావును పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీగా నియమించారు. సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథబాబును పోలీస్ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ బి.సీతారామయ్యను గుంటూరు ఎస్‌బీ డీఎస్పీగా, పల్నాడు జిల్లా ఉమెన్ పీఎస్ డీఎస్పీ బి.ప్రసాద్‌ను చంద్రగిరి డీఎస్పీగా బదిలీ చేశారు.

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు



తాడేపల్లి రూరల్: ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పిన ఘటన ఆదివారం ఈమని వద్ద జరిగింది..తెనాలి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా ఈమని వద్ద పంట పొలాల్లోకి దూసుకు వెళ్లడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. పంట కాలువ గోతిలోకి వెళ్లి పడకుండా నిలిచిపోవడంతో ప్రయాణికులతో పాటు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. తెనాలి డిపో నుంచి ఈమని మీదుగా బస్సు వల్లభాపురం వెళుతోంది. దుగ్గిరాల మండలం ఈమని దాటగానే స్టీరింగ్‌కు, టైర్లకు మధ్య లింక్ ఊడిపోయింది. దీంతో బస్సు కంట్రోల్ కాక కుడి వైపున పంట పొలాల్లో ఉన్న గోతిలోకి వేగంగా వెళ్లింది. ముందు చక్రాలు బోదిలో ఇరుక్కుపోయాయి. వెనుక చక్రాలు ఐదు అడుగులకు పైగా లేచాయి. ఈ సమయంలో 10 మంది మాత్రమే ప్రయాణికులు ఉన్నారు. ఆ రహదారిపై వెళ్లేవారు స్పందించి బస్సులో ఉన్నవారిని బయటకు దించారు. బస్సు నిదానంగా వెళ్లడంతో ప్రమాదం తప్పిందని, ఇదంతా తమ అదృష్టమని పలువురు ప్రయాణికులు వ్యాఖ్యానించారు.

జిల్లాలో మరో ముగ్గురు ఎస్‌ఐలు బదిలీ

నగరంపాలెం: జిల్లాలో మరో ముగ్గురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐలు ఎం.సుబ్బారావును వట్టిచెరుకూరు పీఎస్‌కు, కె.బాబును పెదకాకాని పీఎస్‌కు, షేక్ ఖాజీబాబును మేడికొండూరు పీఎస్‌కు బదిలీ చేశారు.

ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు, పీసీలు బదిలీ

జిల్లాలో ఆరుగురు ఏఎస్‌ఐలు, తొమ్మిది మంది హెడ్ కానిస్టేబుళ్లు, 13 మంది కానిస్టేబుళ్లను జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.5.35 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



తాడేపల్లి రూరల్: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ సెంటర్ కొత్తూరులో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహ నిమజ్జనోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లికి చెందిన కళ్లం చరిష్మారెడ్డి, గరుగు శ్రీలక్ష్మి తిరుమలరెడ్డి, గరుగు శ్రీ అవినాష్‌రెడ్డి తరపున కుటుంబ సభ్యులైన డాక్టర్ వైఎస్సార్ కేవీఆర్ ట్రస్ట్ నిర్వాహకులు కళ్లం రాజశేఖరరెడ్డి, గరుగు శ్రీనివాసరెడ్డి లడ్డూ పాటలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 36 కేజీల లడ్డూను రూ.5.35 లక్షలకు దక్కించుకున్నారు. నిమజ్జనం సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆరు వేల మందికి అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. శివపార్వతుల, వినాయక వేషధారణతో భక్తిపాటల ప్రదర్శన ఆకట్టుకుంది. కోలాటం, దాండియా, మేళతాళాలు, వీరభద్రుని నాట్యం, కర్రసాము, బాణసంచాల మధ్య వినాయకుడి గ్రామోత్సం నిర్వహించారు. లడ్డూ వేలం పాట పాడిన వారిని కమిటీ తరఫున సన్మానించారు.

అక్రమాల ఈ-బస్ బే

- నగరంలో 20 ప్రాంతాల్లో నిర్మాణాలకు అనుమతులు
- గత ప్రభుత్వాన్ని తప్పు దోవ పట్టించి కాంట్రాక్టర్‌కు మేలు చేసిన నగరపాలక సంస్థ అధికారులు
- ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్
- గాంధీ పార్కు ఎదురుగా అడ్డగోలుగా నిర్మాణం
- ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో అనుమతిపై నగర ప్రజల నుంచి తీవ్ర విమర్శలు
- నిర్మాణాన్ని నిలుపుదల చేసిన నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు

గాంధీ పార్కు వద్ద ఈ-బస్ బే నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన సెంట్రింగ్ చెక్కలను తొలగించిన పట్టణ ప్రణాళిక అధికారులు



నెహ్రూనగర్: అక్రమార్జనే ధ్యేయంగా గుంటూరు నగరంలో ఈ- బస్ బేల నిర్మాణం జరుగుతోంది. 20 ప్రాంతాల్లో నిర్మాణానికి నగరపాలక సంస్థ అధికారులు అనుమతులు ఇచ్చేశారు. కాంట్రాక్టర్ నిబంధనల్ని గాలికొదిలేసి, ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు చేపడుతున్నాడు. రద్దీ ప్రాంతాల్లోనూ నిర్మాణాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు కూడా ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేయకపోగా, కాంట్రాక్టర్‌కు సహాయ సహకారాలు అందిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి అనుమతులు

గుంటూరు నగర ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే ఉద్దేశంతో 20 ప్రాంతాల్లో ఈ బస్‌బేల నిర్మాణాలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ ఏర్పాటు కాకముందు గత ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది.

అయితే, పట్టణ ప్రణాళిక అధికారులు తప్పుదోవ పట్టించారు. యాడ్ ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు మేలు చేసే విధంగా వ్యవహరించారు. ఈ- బస్ బేలు అవసరం లేనప్పటికీ ప్రభుత్వాన్ని నమ్మించారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కూడా నిర్మాణాలు చేపట్టే విధంగా అనుమతులు మంజూరు చేయించారు. ఈ తతంగం అంతా చేయడానికి పట్టణ ప్రణాళిక అధికారులు భారీ స్థాయిలో ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

20 ప్రాంతాలు ఇవే

గుజ్జనగుండ్ల పార్క్, రాధాకృష్ణా థియేటర్ పాత బస్టాండ్, వాసవీ క్లాత్ మార్కెట్ మంగళగిరి రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు, జీజీహెచ్ మార్చురీ దగ్గర, కొరిటిపాడు పార్కు, పల్నాడు బస్టాండ్, పట్టాభిపురం మెయిన్‌రోడ్డు, చిలకలూరిపేట, నరసరావుపేట రోడ్డు జంక్షన్ వద్ద, జేకేసీ కాలేజీ రోడ్డు(ఆర్టీఓ వై జంక్షన్), ఓల్డ్ క్లబ్ రోడ్డు (మణిపురం ఫ్లైఓవర్ వద్ద), నగరంపాలెం రోడ్డు, నాజ్‌సెంటర్, లాడ్జి సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, పొన్నూరు రోడ్డు, గాంధీ పార్కు, ఉల్ఫ్ హాల్ దగ్గర, వెల్‌కం హోటల్ దగ్గర, మున్సిపల్ ట్రావెలర్ బంగ్లా దగ్గర ఏర్పాటు చేస్తారు.

అనుమతులకు మంగళం

ఈ- బస్ బేల నిర్మాణంలో కాంట్రాక్టర్ నిబంధనలు మంగళం పాడుతున్నాడు. నగరపాలక సంస్థ నుంచి తీసుకున్న అనుమతులు ఒకటి...నిర్మాణాలు చేపట్టేది మరొకటిగా ఉంటున్నాయి. ఉదాహరణకు 80 అడుగుల్లో నిర్మాణాలు చేపట్టాలని అనుమతులు ఉంటే, దానికి విరుద్ధంగా 160 అడుగులు చేపడుతున్నారు. కళ్ల ముందే ఇదంతా జరుగుతున్నా పట్టణ ప్రణాళిక అధికారులు కనీసం కన్నెత్తి చూడట్లేదు. నగరపాలక సంస్థ స్థలాల్ని యథేచ్ఛగా వాడుకోవడంపై నగర ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

సేవ ముసుగులో వ్యాపారం

ప్రజలకు సేవ ముసుగులో పక్కా వ్యాపారం చేసేందుకు ఈ- బస్‌బేల నిర్మాణం చేపడుతున్నారనే తీవ్ర ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి. ఈ- బస్ బేలో 24/7 ఫుడ్ కోర్ట్, మెడికల్ షాపు, ఈ- టాయిలెట్స్, పైన కమర్షియల్ వ్యాపార సంస్థలకు అద్దెలకు ఇవ్వడంతో పాటు, ఆ పైన ప్రకటనలు బోర్డులు ఏర్పాటు చేసే ప్లాన్‌లో కాంట్రాక్టర్ ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి గానూ కార్పొరేషన్‌కు కట్టేది నెలకు రూ.10వేలు మాత్రమే అంటే ఆశ్చర్య పడక తప్పదు. బస్ బే ద్వారా నెలకు రూ. లక్షల్లో ఆదాయం సమకూర్చే విధంగా పట్టణ ప్రణాళిక అధికారులు కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరుస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. గాంధీ పార్కు వద్ద నిర్మాణం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టడంపై సోషల్ మీడియాలో దుమారం రేగడంతో దాని నిర్మాణాన్ని పట్టణ ప్రణాళిక అధికారులు అడ్డుకున్నారు.

కాంట్రాక్టర్‌పై గుసగుసలు

ఈ- బస్ బే నిర్మాణానికి ఎవరూ అడ్డుపడినా వారిని మేనేజ్ చేసుకుని తన దారికి తీసుకువచ్చే సత్తా కాంట్రాక్టర్‌కు ఉందని కార్పొరేషన్ కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. నగరపాలక సంస్థలకు ఏ అధికారి వచ్చినా తన దారిలోకి తెచ్చుకోవడంలో ఆయన సిద్ధహస్తుడని పేరుంది. నగరంలో ఈ బస్ బేల నిర్మాణంపై దుమారం రేగుతున్న పరిస్థితుల్లో నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

వైద్య కళాశాల పనులు పూర్తి చేయాలి



మెడికల్ కళాశాలలపై వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదు. బాపట్ల మెడికల్ కళాశాలకు గతంలో రూ.550 కోట్ల నిధులు మంజూరు చేయగా.. రూ.150 కోట్లతో నిర్మాణ పనులు వేగంగా సాగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిలుపుదల చేసి చోద్యం చూస్తున్నారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ఎంతో మందికి వైద్య సేవలతోపాటు మెడికల్ విద్యార్థులను తీర్చిదిద్దే కళాశాలలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు మానుకోవాలి.

– జోగి రాజా, దళిత సంఘం నాయకుడు, బాపట్ల



ప్రైవేటుపరం చేయడం తగదు



పేదలకు వైద్య విద్యను చేరువ చేసే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాలలను భారీగా మంజూరు చేయించారు. పనులు కూడా ప్రారంభించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్యవిద్యను నీరుగార్చుతూ ప్రైవేటుపరం చేయాలని చూడటం బాధాకరం. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కళాశాలలపై చేసిన ప్రకటన హాస్యాస్పదం. జిల్లాకు ఒక వైద్య కళాశాలను ప్రభుత్వం పూర్తి చేసి, పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలి.

– దాది శంకర్, రేపల్లె

శిశువుల పాలిట సం'జీవ'ని

- తెనాలి జిల్లా వైద్యశాలలోని ఎస్ఎన్‌సీయూ విస్తృత సేవలు
- ఆస్పత్రిలో 25 ఇంక్యుబేటర్లు
- ఏడాదికి నగటున 1600 మంది శిశువులకు వైద్య సేవలు
- ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ పుట్టిన వారికి చికిత్స



చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్న నర్సులు

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలోని ఎస్ఎన్‌సీయూ (స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్) చిన్నారుల పాలిట సంజీవనిగా మారింది. బరువు, నెలలు తక్కువగా పుట్టిన చిన్నారులు, ఇన్‌ఫెక్షన్, ఇతర వ్యాధులతో ఇబ్బందులు పడే వారికి వైద్యం అందించి ప్రాణాల్ని రక్షిస్తోంది. ప్రైవేట్ వైద్యశాలలో జన్మించిన చిన్నారులకు కూడా ఇక్కడ ఉచితంగా వైద్యం అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతోంది.

విస్తరణతో సేవలు విస్తృతం

అప్పుడే పుట్టిన బిడ్డలకు సేవలందించేందుకు తెనాలి జిల్లా వైద్యశాలలో గతంలో ఎస్ఎన్‌సీయూను ఏర్పాటు చేశారు. తెనాలికి 150 పడకల నూతన తల్లీపిల్లల వైద్యశాల మంజూరు కావడంతో దాన్ని జిల్లా ఆస్పత్రి ఆవరణలో 2019లో నిర్మించారు. అదే ఏడాది ఫిబ్రవరి 14న జిల్లా వైద్యశాలలోని ఎస్ఎన్‌సీయూ యూనిట్‌ను తల్లీపిల్లల వైద్యశాలకు మార్చి సేవలు ప్రారంభించారు. తొలుత ప్రభుత్వ వైద్యశాలలో జన్మించిన చిన్నారులకు మాత్రమే ఇక్కడ చికిత్స అందించేవారు. తర్వాత దాని సేవల్ని విస్తరించారు. ప్రైవేట్ వైద్యశాలలో జన్మించిన వారికీ కూడా అందిస్తున్నారు. ప్రస్తుతం నెలకు 110 నుంచి 130 మంది చిన్నారులకు సేవలు అందిస్తుంటారు. అంటే ఏడాదికి సుమారు 1600 మంది చొప్పున ఐదేళ్లలో ఎనిమిది వేల మందికి పైగా చికిత్స అందించారు.

ఇంక్యుబేటర్ సౌకర్యం

అప్పుడే పుట్టిన శిశువుల నుంచి నెలలోపు చిన్నారులకు ఎటువంటి సమస్య వచ్చినా వారిని ఇంక్యుబేటర్‌లో ఉంచి చికిత్స అందిస్తుంటారు. గతంలో యూనిట్ లేకపోవడం వల్ల మరణాలు ఎక్కువగా సంభవిస్తుండేవి. అందుబాటులోకి వచ్చిన తర్వాత సంఖ్య చాలా తగ్గింది. నేడు శిశు మరణాల రేటు సున్నాగా రికార్డులు చెబుతున్నాయి.

పట్టించుకోని ప్రభుత్వం

ఎస్ఎన్‌సీయూలో వైద్యుల్ని నియమించాలని కోరుతూ నేషనల్ హెల్త్ మిషన్ ఉన్నతాధికారుల్ని స్థానిక వైద్య అధికారులు కోరుతూ వస్తున్నారు. కానీ ఇప్పటి వరకు ఆ ప్రక్రియ జరగలేదు. దీంతో అటు తల్లీపిల్లల వైద్యశాలలో ఓపీ, వార్డులలో సేవలు అందిస్తూ మరోవైపు ఎస్ఎన్‌సీయూ బాధ్యతలు చూస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఎస్ఎన్‌సీయూలో వైద్యులను నియమించాలని స్థానిక వైద్యాధికారులు కోరుతున్నారు.

సేవలను ఉపయోగించుకోవాలి



బరువు తక్కువ, ఆయాసం, పచ్చకామెర్లు సోకిన అప్పుడే పుట్టిన చిన్నారులకు ఎస్ఎన్‌సీయూలో సేవలు అందిస్తున్నాం. తల్లీపిల్లల వైద్యశాలలో జన్మించిన వారికే కాకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లో పుట్టిన వారికి కూడా చికిత్స అందిస్తాం. ప్రజలంతా సేవల్ని ఉపయోగించుకోవాలి.

– డాక్టర్ బి. రామాంజనరావు, ఎస్ఎన్‌సీయూ యూనిట్ ఇన్‌చార్జి, తెనాలి

వేధిస్తున్న వైద్యుల కొరత

ప్రస్తుతం తల్లీపిల్లల వైద్యశాలలో 20 ఇంక్యుబేటర్లు ఉన్నాయి. ఇవి కాకుండా మరో ఐదు అత్యవసర పరిస్థితి కోసం ఏర్పాటు చేశారు. ఆస్పత్రి నిర్వహణకు అవసరమైన నిధుల్ని నేషనల్ హెల్త్ మిషన్ సమకూర్చుతోంది. వైద్యులు, సిబ్బందిని కూడా ఎన్‌హెచ్ఎం నియమించి వేతనాలు కూడా ఇస్తోంది. గతంలో ఇక్కడ నలుగురు చిన్న పిల్లల వైద్యులు పనిచేసే వారు. వారిలో ఇద్దరు మూడు సంవత్సరాల కిందట రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఇద్దరు వైద్యులే ఎస్ఎన్‌సీయూ బాధ్యతలు చూస్తూ వచ్చారు. వారికి ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో ఈ ఏడాది మార్చిలో రాజీనామా చేసి వెళ్లి పోయారు. చేసేదిలేక స్థానిక అధికారులు తల్లీపిల్లల వైద్యశాలలో పనిచేసే నలుగురు ప్రభుత్వ వైద్యులకు బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థుల్లో 'ఇన్‌స్పైర్' కరువు

- భావి శాస్త్రవేత్తలకు ప్రోత్సాహం ఇవ్వని ప్రైవేటు పాఠశాలలు
- విద్యార్థులను ప్రోత్సహించడంలో నిర్లక్ష్యం
- ఇన్‌స్పైర్ మానక్ 2024–25 నమోదుకు తుది గడువు వచ్చేనెల 15కు పొడిగింపు
- ఎంపికైన విద్యార్థులకు ప్రాజెక్టు తయారీకి రూ.10 వేలు మంజూరు చేయనున్న కేంద్రం
- ఇన్‌స్పైర్‌కు నమోదు చేసుకున్న వారిలో 75 శాతం ప్రభుత్వ విద్యార్థులే..



ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రాజెక్టులను తిలకిస్తున్న డీవైఈవో వెంకటేశ్వరరావు (ఫైల్)



ఫిబ్రవరిలో జరిగిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయిలో విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రోత్సాహం కరువవుతోంది. చిట్టి బుర్రల్లో నూతన ఆలోచనలను రేకెత్తించాల్సిన యాజమాన్యాలు బాధ్యతను విస్మరిస్తున్నాయి. పాఠ్య పుస్తకాలకే పరిమితం చేస్తున్నాయి. సృజనాత్మక నైపుణ్యాల్ని వెలికితీయడంలో విఫలమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మానక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలకు విద్యార్థుల్ని పంపుతున్న పాఠశాలల సంఖ్య క్రమేణా తగ్గుతోంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలతో పోల్చితే ప్రైవేటు రంగంలోని పాఠశాలలు వెనుకంజలో ఉన్నాయి. ఇన్‌స్పైర్ ప్రదర్శనల సమాచారాన్ని చేరవేసి ఆసక్తి గల వారిని ప్రోత్సహించే కనీస బాధ్యతను విస్మరిస్తున్నాయి. విద్యార్థుల్ని ప్రోత్సహించడంలో గుంటూరు నగరంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు వెనుకబడ్డాయి

నమోదుకు గడువు పొడిగింపు

కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ ఏటా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మానక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనల్లో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో విద్యార్థులతో ప్రతిపాదనలు స్వీకరించేందుకు గడువు ఆదివారంతో ముగిసింది. అయితే ప్రాజెక్టుల నమోదుకు ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పిస్తూ అక్టోబర్ 15 వరకు పొడిగించింది. విద్యా, వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక, పర్యావరణ, అంతరిక్ష, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ రంగాల వారీగా నూతన ఆవిష్కరణలకు దోహదం చేసే సమగ్ర నివేదికను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి ఐదు, ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో మూడు చొప్పున విద్యార్థులతో ప్రాజెక్టు నివేదికలను రూపొందించాలి. ఇందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి. విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించేందుకు సైన్స్ ఉపాధ్యాయులకు బాధ్యత అప్పగించాలి. ఎంపికైన విద్యార్థులకు ప్రాజెక్టు తయారీకి కేంద్ర ప్రభుత్వం రూ.10 వేలు అందిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థులు ఎంచుకున్న ప్రాజెక్టు పేరు, దాని వల్ల సమాజానికి, ప్రజలకు మేలు చేసే అంశాలతో నివేదికను గైడ్ టీచర్ సహాయంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లు	: 1,674
ఇప్పటి వరకు నమోదు చేసుకున్న పాఠశాలలు	: 195
వీటిలో ప్రభుత్వ స్కూళ్లు	: 165
ప్రైవేటు స్కూళ్లు	: 30
ఇప్పటి వరకు నమోదైన ప్రాజెక్టులు	: 950

రిజిస్ట్రేషన్లు నత్తనడక

ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను తొలుత డివిజన్ స్థాయిలో ప్రదర్శిస్తారు. అక్కడి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. గుంటూరు జిల్లాలోని 1,073 ప్రభుత్వ పాఠశాలలతో పాటు 601 ప్రైవేటు పాఠశాలల పరిధిలో ఆదివారం నాటికి 950 మాత్రమే ఇన్‌స్పైర్ మానక్ రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో 165 ప్రభుత్వ, 30 ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రాజెక్టులను నమోదు చేసుకున్నారు. ఇందులోని 95 ప్రాజెక్టుల్లో 75 శాతం ప్రభుత్వ విద్యార్థులే ఉన్నారు.


పాఠశాలలపై చర్యలు చేపడతాం

ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శనలకు జిల్లాలోని అన్ని యూపీ, హైస్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థులకు సమాచారం ఇచ్చి, ఆసక్తి గల వారిని ప్రోత్సహించాలి. తరగతి గదిలో చదువుతో పాటు శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి పర్చడంలో ఇన్‌స్పైర్ ప్రోగ్రామ్ ఎంతో కీలకం. ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్ చేయించుకోని పాఠశాలలు పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోవాలి.

– పి.శైలజ, జిల్లా విద్యాశాఖాధికారి

నేత్రపర్వంగా అమరావతి నృత్యోత్సవం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా కె.ఆర్.కె.ఎం.మెమోరియల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి కోకా విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమరావతి నృత్యోత్సవం ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. మహా గణపతిం, జతి స్వరం, రామాయణ శబ్దం, ఆనందతాండవమాడే శివుడు అనే అంశాల్ని అకాడమీ విద్యార్థులు హావభావాలతో చక్కగా ప్రదర్శించారు. అనంతరం కర్ణాటక కళారత్న అవార్డు గ్రహీత, అంతర్జాతీయ కళాకారులు సత్యనారాయణరాజు ప్రదర్శించిన రామకథ ఆహ్లాదకరంగా సాగింది. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆడిటర్ రామరాజు శ్రీనివాస్, ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, వీవీఐటీ నంబూరు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్యం

క్లుప్తంగా

కరాటే పోటీల్లో మంగళగిరి విద్యార్థులకు పతకాలు



మంగళగిరి: ఇటీవల ఏలూరులో జరిగిన నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో మంగళగిరి ఎంఎంకే స్టేడియం విద్యార్థులు ప్రతిభ కనపరచి పతకాలు సాధించారు. అండర్– 19 బాలుర విభాగంలో జె.మోహన్ సాయి బంగారు పతకం, అండర్ – 14 విభాగంలో కె. మహర్షిసాయి బంగారు పతకం, కె. నీరజ్ కుమార్ బ్రాంజ్ మెడల్ సాధించారు. అండర్– 12 విభాగంలో డి. మోనిష్కృతన్ సిల్వర్ మెడల్, కటాస్ విభాగం అండర్– 17 బాలుర విభాగంలో వి. శ్రీరామ్ బంగారు పతకం, బాలికల అండర్– 12 విభాగంలో ఎస్. హేమావతి బంగారు పతకం, సుమ బ్రాంజ్ మెడల్ సాధించారు. విద్యార్థులను స్టేడియం ప్రతినిధులు, కోచ్ డి. ప్రభాకర్ అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

ఫిరంగిపురం: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి ఫిరంగిపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములూరిపాడుకు చెందిన కె.నాగరాజు (25)శనివారం రాత్రి ఫిరంగిపురం గ్రామ శివారులోని ఓ హోటల్‌లో బిర్యాని తినేందుకు వచ్చాడు. అనంతరం రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి కడప వెళుతున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : యువకుడి మృతి


ప్రకాష్ మృతదేహం

ప్రత్తిపాడు: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం .. ప్రత్తిపాడుకు చెందిన నుదురుపాటి ప్రకాష్ (21) ఆదివారం రాత్రి ప్రత్తిపాడు వైపు నుంచి గుంటూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. అదే సమయంలో గుంటూరు వైపు నుంచి పర్చూరు వైపు మరో ద్విచక్ర వాహనం వస్తోంది. గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డులో తిక్కిరెడ్డిపాలెం సమీపంలో ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ప్రకాష్‌కు తీవ్ర రక్తస్రావం కావడంతో ఘటనా స్థలిలోనే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యభర్తలు ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోసుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

స్టాఫ్ నర్సుల నిరసన తీవ్రం

- నోటికి రిబ్బన్లు కట్టుకుని ప్రదర్శన
- 10వ రోజుకు చేరుకున్న ఆందోళన
- మంగళవారం నుంచి అత్యవసర వైద్యసేవలకు మాత్రమే హాజరు



జీజీహెచ్ ఆవరణలో ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు ఆదివారం నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నంబర్ 115ను వెనక్కి తీసుకోవాలని, తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు నిరసన ఆదివారానికి పదో రోజుకు చేరుకుంది. విధులు బహిష్కరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. తమ గోడు పట్టించుకోవటం లేదని, గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జీఓను రద్దు చేసి రెగ్యులర్ చేసే వరకు నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. పది రోజులుగా నిరసన చేస్తున్నా ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవటం లేదని వాపోయారు. ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి విధులు పూర్తిగా బహిష్కరిస్తామని, అత్యవసర వైద్యసేవలకు మాత్రమే హాజరవుతామని పేర్కొన్నారు. అప్పటికీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించని పక్షంలో అత్యవసర వైద్యసేవల్ని సైతం నిలిపివేసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నేతలు స్వచ్ఛంద ప్రసాద్, పి. మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ బి. శివమ్మ, కోశాధికారి వి. విజయ్‌కుమార్, కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరి, రమాదేవి, సభ్యులు కుసుమకుమారి, సుధారాణి పాల్గొన్నారు.

యువత సరికొత్త ఆవిష్కరణలకు పూనుకోవాలి

విజ్ఞాన్ యూనివర్సిటీలో ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు


మాట్లాడుతున్న చంద్రశేఖర్

చేబ్రోలు: యువత ఆలోచనలకు పదును పెట్టి సరికొత్త ఆవిష్కరణలకు పూనుకోవాలని కర్ణాటక టుంకూర్‌లోని సీవోపీపీఆర్ఆర్‌ఓడీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ డాక్టర్ హెచ్‌జీ చంద్రశేఖర్ తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం ప్రఖ్యాత ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీర్స్ డే వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ హెచ్‌జీ చంద్రశేఖర్ మాట్లాడుతూ మన దేశ భవిష్యత్, అభివృద్ధి మొత్తం యువత మీదే ఆధారపడి ఉందని తెలిపారు. జీవితంలో విలువలతో కూడిన విజయం సాధించడం ముఖ్యమని చెప్పారు. కర్ణాటకలోని టుంకూర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజానికీ, ప్రజలకు ఉపయోగపడే వినూత్న ఆలోచనలు చేసే ఇంజినీర్లకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రపంచం ఇంత వేగంగా ముందుకెళ్తుందంటే దానికి కారణం ఇంజినీర్లేనని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రస్తుతం దేశానికి మిలియన్ల మంది ఇంజినీర్ల అవసరం ఉందన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి సరికొత్త టెక్నాలజీలను వినియోగించాలని సూచించారు. వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులంతా మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని సరికొత్త టెక్నాలజీలను ఆవిష్కరించాలని తెలిపారు. ఇంజినీర్స్‌డేను పురస్కరించుకుని విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.ఎస్. రఘునాథన్ పాల్గొన్నారు.

భరత జాతి ముద్దుబిడ్డ విశ్వేశ్వరయ్య


విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద అధికారులతో కలిసి నివాళులర్పిస్తున్న ఎస్ఈ కె.వెంకటరమణ

సత్రశాల(రెంటచింతల): ఇంజినీరింగ్ రంగంలో అసాధారణ ప్రతిభతో అత్యున్నత శిఖరాలను అధిరోహించి మన దేశ ఖ్యాతిని నలుదిక్కులకు చాటిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారత జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ అని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ ఎస్ఈ కె.వెంకటరమణ అన్నారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ప్రాజెక్ట్ ఆవరణలోని విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. 1861 సెప్టెంబర్ 15న జన్మించిన విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా ఇంజినీర్స్‌డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జలాశయాల నిర్మాతగా, ఆర్థికవేత్తగా ప్రపంచ వ్యాప్తంగా శాశ్వత కీర్తిని గడించిన డా.విశ్వేశ్వరయ్యను భారత ప్రభుత్వం 1955లో భారత రత్న పురస్కారం తోనూ, బ్రిటిష్ ప్రభుత్వం అత్యుత్తమ పౌర పురస్కారమైన బ్రిటిష్ నైట్‌హుడ్‌గా సన్మానించిందని తెలిపారు. ఏఈఈలు ఎస్.జయపాల్, బి.కాసులు, స్పెషల్ ఫోర్స్ సిబ్బంది, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్తిపాడులో ఒంగోలు జాతి పశు ప్రదర్శన

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో నందమూరి తారక రామారావు మెమోరియల్, నూతలపాటి పరమేశ్వరరావు మెమోరియల్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఒంగోలు జాతి పశు ప్రదర్శన జరగనుంది. పాల పళ్ల, రెండు పళ్ల, నాలుగు పళ్ల, ఆరు పళ్ల విభాగాలతో పాటు సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్, కేటగిరీ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. తొలి రోజు టచ్ పళ్ల విభాగంతో ప్రదర్శన ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఒక విభాగంలో పాల్గొన్న జతలు మరొక విభాగంలో పాల్గొనేందుకు అవకాశం లేదని, జెర్సీ జాతికి ప్రవేశం లేదని పేర్కొన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

అట్రాసిటీ కేసులో విచారణ

పెదకూరపాడు: మండలంలోని లగడపాడులో వినాయక శోభాయాత్ర సందర్భంగా ఎస్సీలపై అగ్రకులాలు జరిపిన దాడికి సంబంధించి నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్‌బాబు ఆదివారం విచారణ చేపట్టారు. ఈ నెల 9న వినాయకుని శోభాయాత్ర సందర్భంగా ఎస్సీ కులానికి చెందిన ఎర్రగోల్ల నరసింహరావు, పల్లం ఏసుపాదంపై అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు దాడి చేశారు. ఈ సందర్భంగా బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాధితులు, సాక్షులను విచారించారు. వారి వెంట ఎస్ఐ బాలూనాయక్ తదితరులు ఉన్నారు.

అప్సా డెమోక్రటిక్ జిల్లా శాఖ నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఏ.ఎస్. రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ (అప్సా డెమోక్రటిక్) సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్లో ఆడిటోరియంలో నిర్వహించారు. ఇందులో గుంటూరు జిల్లా శాఖకు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షునిగా సాదినేని శ్రీనివాసరావు (భారవి స్కూల్), అధ్యక్షుడిగా చిన్నం శ్రీనివాసరావు (ఎస్ఆర్ఎస్ రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్), కార్యదర్శిగా డాక్టర్ కోనూరు జయకుమార్(ఇంటెల్ హైస్కూల్), ఉపాధ్యక్షుడిగా పఠాన్ ముసారత్ (రత్నం స్కూల్), సంయుక్త కార్యదర్శిగా నక్కా జార్జిబాబు (ఒలీవ్ స్కూల్), కార్యనిర్వాహక సభ్యులుగా రంగాచారి (సిమ్స్ మై స్కూల్), శివ శంకర్ (విజేత స్కూల్)తో పాటు మరి కొంతమంది సభ్యుల్ని తెనాలి, తాడికొండ, మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు, గుంటూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్, నియోజకవర్గాల నుంచి ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అప్సా డెమోక్రటిక్ వ్యవస్థాపక చైర్మన్ గొల్లపూడి మోహన్‌రావు మాట్లాడుతూ తక్కువ వ్యవధిలో జిల్లాలో నియోజకవర్గాల వారీగా పెద్దసంఖ్యలో సభ్యులుగా చేరడం శుభ పరిణామమని తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు, మల్లికార్జునరెడ్డి (మైలవరం), మన్నవ అప్పాజీ (మంగళగిరి), చిరుమామిళ్ల రాము (నరసరావుపేట), ఆక్స్‌ఫర్డ్ కాలేజీ డీజీఎం విడదల శేషగిరిరావు పాల్గొన్నారు.

యాదవ మహా సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు


నాగరాజును సన్మానిస్తున్న సంఘం సభ్యులు

గుంటూరు రూరల్: అఖిలభారత యాదవ మహా సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా మిర్చి యార్డు మాజీ డైరెక్టర్ తాళ్ల నాగరాజు యాదవ్ ఎన్నికయ్యారు. నగరంలోని గ్రాండ్ నాగార్జున హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అఖిల యాదవ మహా సంఘం జిల్లా, నగర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోరంట్ల గ్రామానికి చెందిన తాళ్ల నాగరాజు యాదవ్, నగర అధ్యక్షుడిగా కొండేపి శేఖర్ యాదవ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యుల్ని సంఘం జాతీయ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, కార్యదర్శి కె.ఎల్.పి. యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పటూరి పేరయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు పెద్దిబోయిన బాలయ్య తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రానున్న కాలంలో సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. యాదవుల్ని ఒకే తాటిపైకి తెచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలువురు యాదవులు పాల్గొన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు

అన్నదానాన్ని ప్రారంభించిన కమిషనర్ సాధు నరసింహారెడ్డి


కస్టమ్స్,జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డిని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు

లక్ష్మీపురం: స్థానిక చుట్టుగుంట శ్రీ సాయి విల్లా అపార్టుమెంట్‌లో ఏర్పాటుచేసిన గణనాథుని పందిట్లో ఆదివారం కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. తొమ్మిదో రోజైన చివరి రోజు నిమజ్జనం సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ దేశ సంస్కృతికి పండుగలు ప్రతీకలన్నారు. ఈ వినాయక చవితి పండుగ కోట్లాది మందికి అన్నదానం చేసిందన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు శాఖమూరి శ్రీనివాస్, పువ్వాడ వెంకటేశ్వరరావు, డాక్టర్ నారాయణ, రామకృష్ణ, మొగిలి గురవయ్య తదితరులు కమిషనర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జీఎస్టీ అధికారులు గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, బిల్లా ప్రశాంత్, కాకర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకూ ఆటలు అవసరం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, పక్కన నాయకులు


చెస్ ఆడుతున్న ఉపాధ్యాయినులు


పరుగు పందెంలో పోటీపడుతున్న ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకూ ఆటలు, సాంస్కృతిక నైపుణ్యాలు అవసరమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా సంఘ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పిచ్చుకలగుంట, బీఆర్ స్టేడియాల్లో ఉపాధ్యాయులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకే పరిమితం కాకుండా ఉపాధ్యాయుల్లో అంతర్లీనంగా ఉన్న సామర్థ్యాలను వెలికి తీయడానికి యూటీఎఫ్ కృషి చేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా సంఘం స్థాపించి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా సాంస్కృతిక , ఆటల పోటీలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ గెలుపొందిన అందరికీ డిసెంబర్‌లో జరగనున్న స్వర్ణోత్సవాల్లో బహుమతి ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఏ.ఎన్. కుసుమకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. యూటీఎఫ్‌ఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఎందరో అమరుల త్యాగాల ఫలితంగా యూటీఎఫ్ ఆవిర్భవించిందని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునే కర్తవ్యాన్ని ఉపాధ్యాయులు స్వీకరించాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ యూటీఎఫ్ విద్యా రంగంతో పాటు సామాజిక స్పృహతోనూ పని చేస్తోందని తెలిపారు. కోవిడ్, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలిచి, సేవా కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహాధ్యక్షురాలు ఏ.ఎల్. శివపార్వతి, జిల్లా కోశాధికారి ఎండీ. దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్. ఆదినారాయణ, కె.సాంబశివరావు, జి.వెంకటేశ్వర్లు, యు.రాజశేఖర్‌రావు, ఎం .గోవిందయ్య, టి.ఆంజనేయులు, ఏ.శ్రీనివాసరావు, జి. ధనలక్ష్మి, కె. కేదార్‌నాథ్, ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ మహా సంఘం జిల్లా సమావేశం

అమరావతి: అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘ సమావేశం సోమవారం స్థానిక యోగాశ్రమంలో నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక అమరేశ్వర స్వామి దేవస్థానంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం తదనంతరం యోగాశ్రమంలో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన అమరావతి క్షేత్ర పురోహితుడు కౌశిక ప్రసాదశర్మతో పాటుగా కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి బ్రాహ్మణసోదరులందరూ హాజరవ్వాలని కోరారు.

బీసీ వర్గీయులపై టీడీపీ దాడులు దారుణం

- బాధ్యులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించండి
- బాధితుడు సుబ్బారావును పరామర్శించిన డాక్టర్ గోపిరెడ్డి


బాధితుడి ఒంటిపై గాయాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మండలంలోని యలమంద గ్రామంలో బీసీ వర్గీయులపై టీడీపీ నాయకుల దాడుల్ని అరికట్టి, నిందితులను వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ప్రభుత్వ వైద్యశాలలో టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న నూతలపాటి సుబ్బారావును పరామర్శించారు. జరిగిన విషయాన్ని బాధితుడు, ఆయన సోదరి నాగేంద్రాన్ని అడిగి తెలుసుకున్నారు. బాధితుడి చికిత్సపై డాక్టర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ యలమంద గ్రామంలో గత కొన్నిరోజులుగా బీసీ కులస్తులపై జరుగుతున్న దాడులు అమానుషమని ఖండించారు. ఇప్పటికే యాదవులు, వడ్డెర్లపై దాడిచేసి గ్రామం నుంచి తరిమివేశారన్నారు. ఇప్పుడు రజక కులస్తుల వంతు వచ్చిందన్నారు. కేవలం గత ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ఓటేశాడనే ఒకే ఒక కారణంతో సుబ్బారావును దినేష్, మౌలాలి అనే ఇద్దరు వ్యక్తులు అపహరించి రాడ్లు, కర్రలతో శరీరమంతా దారుణంగా కొట్టారని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం వారి వేధింపులు భరించలేక సుమారు 30 కుటుంబాలు ఊరు వదిలిపెట్టి వివిధ ప్రదేశాల్లో బతుకుతున్నారన్నారు. వాళ్ళని పట్టుకొచ్చి మరీ కొట్టడం దారుణమైన విషయమని పేర్కొన్నారు. బాధితుడి సోదరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసి పోలీసులను తీసుకొని వెళితే వారి సమక్షంలోనే తిరిగి సుబ్బారావును టీడీపీ వర్గీయులు దారుణంగా కొట్టారని తెలిపారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు. ఎన్నికల వాగ్దానాలైన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోగా, హత్య రాజకీయాలతో కాలక్షేపం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత వ్యక్తి తమ్ముడు శ్రీకాంత్ ఇంటిపై కూడా దాడి చేశారని, ఇతను చేసిన పాపం వలంటీర్‌గా పని చేయటమేనని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు చూడాలని, యలమంద గ్రామాన్ని వదిలిపెట్టి వెళ్లిపోయిన వారిని ఊరిలోకి తీసుకొచ్చేందుకు ఎస్పీ చొరవ చూపించాలని గోపిరెడ్డి కోరారు. బాధితుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరావు, పచ్చవ రవీంద్ర, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

యోగా జాతీయ పోటీలకు చందలూరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో పీఈటీ ప్రతిమ

జే.పంగులూరు: జాతీయ స్థాయిలో జరగబోయే యోగా పోటీలకు చందలూరు పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆ విద్యార్థులను, పీఈటీని అభినందించారు. గత రెండు రోజుల నుంచి విశాఖపట్నంలో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు అనుబంధంగా ఉన్న విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ –12,14 విభాగంలో పోటీలు జరిగాయి. చందలూరు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు శృతి, వెంకటేష్ ప్రతిభ కనబరిచారు. దీంతో వారు హిమాచల్‌ప్రదేశ్‌లో జాతీయ స్థాయిలో జరగబోయే పోటీలలో పాల్గొననున్నారు. విద్యార్థులను, పీఈటీ ప్రతిమను ఎస్ఎంసీ చైర్మన్ గొట్టిపాటి హరికృష్ణ, హెచ్ఎం గిరిజ, గ్రామ పెద్దలు పెంట్యాల రామలింగస్వామి, అడ్డగడ వెంకట సుబ్బయ్య, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి వడ్డవల్లి వీరనారాయణ అభినందించారు.

వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బాపట్ల: బాపట్లలోని వ్యవసాయ కళాశాలలో 1974 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. దాదాపు 60 మంది పూర్వవిద్యార్థులు హాజరై ఆనాటి మధురస్మృతులను గుర్తుచేసుకున్నారు. విలువైన అనుభవాలను పంచుకున్నారు. దీనికి సహకరించిన కళాశాల డీన్ డాక్టరు ప్రసూనరాణిని అభినందించారు. కళాశాల విద్యార్థులకు అవసరమైన తరగతి గదుల నిర్మాణానికి సహకారం అందిస్తామని తెలిపారు. ఆ మేరకు మయూరవల్లి ఏసీ కొనేందుకు నగదు ఇవ్వడానికి ముందుకొచ్చారు. ఒంగోలులోని విద్యోన్నతి ఫౌండేషన్ నుంచి సాయం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులైన ప్రభుత్వ రిటైర్డు చీఫ్ సెక్రటరీ అజేయ కల్లాం, రిటైర్డు ఆటవీశాఖ అధికారి ఎం.సుధాకర్, జి.వి.నాగేశ్వరరావు, అశోక్‌రాణి, చక్రపాణి, కాశీ విశ్వంత్, సన్యాసిరావు, ఏవీ రంగారెడ్డి, డి.వీరనారాయణ, జయంతి వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం

నాదెండ్ల: కారు టైరు పంక్చరవటంతో జాతీయ రహదారి పక్కన నిలిపి టైరు మార్చుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటన యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామ పరిధిలో తిరుమల స్పిన్నింగ్ మిల్లు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. ఏలూరు జిల్లా నిడమర్రుకు చెందిన వడల కృష్ణ (31), రవికిశోర్ (25) కారు డ్రైవర్లుగా పనిచేస్తుంటారు. కాకినాడలోని హేచరీల నుంచి రొయ్యల శ్యాంపిల్స్‌ను తీసుకుని కారులో నెల్లూరు వెళ్లారు. తిరిగి ఏలూరుకు వెళ్లే క్రమంలో తిమ్మాపురం వద్దకు వచ్చేసరికి ఆదివారం తెల్లవారుజామున కారు వెనుక టైరు పంక్చరైంది. దీంతో రహదారి పక్కన నిలిపి టైరును మారుస్తున్నారు. అదేసమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో వడల కృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, రవికిశోర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. 108 సాయంతో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.